# పొరలు

భూమిలో పొరలున్నాయనీ, భూమికాకర్షణ శక్తి వున్నదనీ, జియాలజీ అంటే భూశాస్త్రం, శాస్త్రజ్ఞులు కనిబెట్టి ఋజువుచేశారు. శ్రీ సూక్తం, పురుషసూక్తం వున్నట్టే భూ సూక్తం గూడా వున్నది. మేదినీదేవీ వసుంధరా అని మొదలౌతుంది.చిన్నదే. రాళ్లకూ ప్రాణముంటుంది. రాళ్ళ నిద్రపోతుండగా కొడితే పగలవు. ప్రాణంలేని రాయి అసలే పగలదు. ప్రాణం వున్నది గనకనే కొండలు పెరుగుతాయి.

అలాగే మంత్రశాస్త్రం, సైకాలజీ పరిశోధనలచేసినవారు మనస్సుకీ పొరలున్నాయన్నారు. తెలుసుకునే అన్నారు.

భూమి పొరలపేరు, అతల, వితల, సుతల, తలాతల, పాతాళ యింకా వున్నాయి. మనస్సులోని పొరలపేర్లు వినోదమిస్తాయి. అవి పదకొండు. కామం, సంకల్పం, వికల్పం, శ్రద్ధా, సత్యం, ధృతి, అధృతి,శ్రీ, హ్రీః, భీః, ధీః. ఆయా వ్యక్తుల కుండే జ్ఞానభేదం వల్ల పరిసరాలూ పరిస్థితుల వత్తిడివల్ల, ఒక్కొక్క పొర పైకి వస్తుంది. మనస్సు విల్లు అయితే మమత కర్ర అయితే క్రియాశక్తి అనే కర్ర నుండి ఒక్కొక్కసారి ఒక్కొక్కపొర బాణం లాగా అయి దూసుకు వస్తుంది. మమత అనే వింటి బద్ద యెక్కుపెట్టి వదులుతుంది అదీ వింత.

2

బలరామ్ చిన్నప్పటినించే తనతండ్రిపడేశ్రమా అవస్థలూ చూస్తూ వచ్చాడు. సాంఘికాచార ప్రకారం పెళ్లీ, తరవాత యిల్లు గుల్ల చేయటానికి బంధువులు రావటం, ఆచారాలూ, మర్యాదలూ చివరికి సంచీ ఖాళీ. బెల్లం అయిపోతుంది. కండచీమలు బెల్లం వెతుకుతూ మరోచోటికి పోతాయి. పోనీ ఆదుకున్నాడూ అని తన తండ్రిపేరు చెప్పుకునేవారూలేరు.

గడపగలిగినంతకాలం ఒంటరిగానే గడిపి, తన తండ్రిని మొదటి స్థితికి పుద్ధరించాడు బలరామ్. కాని మనస్సులో పొరలున్నాయి గదూ,మమత పీడిస్తుంది. రక్తసంబంధం ఆకర్షిస్తుంది. మమత యెక్కుపెట్టగా కామం అనే పొర దూసుకు వచ్చింది. దాన్ని మళ్లా పొదిలో వుంచాలని చూస్తుండగా స్త్రీని తెచ్చుకోవాలనే సంకల్పం కలిగింది బలరామ్‌కి. వద్దులే పీడ వాళ్ల వాళ్లంతా వచ్చి పీక్కుతింటారు. మా నాన్నలాగే అవస్థల పాలై బికారినౌతాను అని వికల్పం పనిచేసింది. నిగ్రహించాడు. కాని కళ్లు తమను నమ్మమన్నాయి. ఆ కళ్లకు టెంప్టేషన్ అండ్ డిజైర్ సాయం పడినాయి. ఆ బాలిక అనాథబాలికలాగా తోచింది. తోడు-నీడ లేనట్టు భ్రమ కల్పించింది. రక్షణలేనట్టు కనబడింది. పాపం రావణాసురుడికీ జనస్థానంలో వున్న సీతాదేవీ అలాగే కన్పించింది. రాజు పెళ్లాంగాదు! రక్షణలేదు. మొగుడేమో ఆహారసేకరణ కోసం, తన స్త్రీని వంటరిగా వదిలి, అడవిలో తిరుగుతూ వుంటాడు. మరో మగవాడుంటాడు, తన స్త్రీ నెత్తుకుపోతాడని ఆలోచన రాదేమో.

చివరికి కళ్లు చెప్పినట్టు చేశాడు బలరామ్. కనులేదురుకి లోనైనాడు. ''పాపం బలరామ్!'' అని జాలిచెంది, శ్రద్ధా సత్యం అనే పొరలు సాయపడి ఆనందమిచ్చాయి.

మనస్సు యిప్పుడు నిండుగా వున్నది. నాదీ అనే స్త్రీ వున్నది. చదువు పూర్తిగాబోతున్నదీ. ఇదుగో యీ డిగ్రీరాగానే వుద్యోగంలో దూరి, తన ఖర్చులు తగ్గించేస్తుంది. ఇంకో సంతోషం ! నిర్భయంగా, సంఘాన్నెదిరించి, సంతానాన్ని చూపి యింకా మనస్సు పొంగేట్టు చేసింది!

తన స్త్రీ, తనవారూ వేరే వేరే వూళ్లల్లో వుంటున్నారు గదా, గలాభా, గలాటా, కొట్లాట, గలాడాయి, దొమ్మీ, దుమ్మెత్తి పోసుకోటం జరిగే అవకాశం లేదనుకున్నాడు బలరామ్. మొదట్లో తన స్త్రీని నిరాధారలాగా చూపించిన కళ్లు

సత్యం పొడగట్టేట్టు చేశాయి. ఆ స్త్రీకి బలగమున్నది. దాని యింటికి ఒక్కొక్కరే వస్తూ దర్శనమివ్వసాగారు. యేదో ఒకరిద్దరే గదా, దాని పిల్లల్ని ముద్దు చేస్తున్నారు అని సరిపెట్టుకున్నాడు బలరామ్. ధృతి అనే పొర సాయంగా వుండి అధృతిని తరిమేసింది.

బలరామ్ యేమరుపాటుగా వుండగా చూసి, అసూయాపరులైన సాటి వుద్యోగులు, పైవారు పిటిషన్లు పెట్టీ, నేరాలు మోపీ సస్పెండ్ చేయించారు బలరామ్‌ని. జూలియస్ సీజర్ని అసూయపరులైన శాసన సభ్యులే వెన్నుపోటు పొడిచారు. సీజర్ జైత్రయాత్ర చేసి, వెండీ బంగారాలూ, బానిసలనూ అపారంగా తెచ్చాడు రోమ్‌కి. ఉదారుడు అని పేరు మోశాడు.

బలరామ్ కళ్లు అర్ధనిమీలితాలనించి పెద్దవైనై. విడివడినై. సత్యం గోచరించింది. భీః అనే పొర భయం కలిగించింది. మనస్సు పరిపరివిధాల పోయింది.

డబ్బు నహి. తన స్త్రీనేం చేయాలో తోచలేదు, మమత పీడించసాగింది. అందుకని ధీః అనే పొర ధైర్యమూ తెలివితేటలూ యివ్వగా స్త్రీతో రాజీ బేరం పెట్టాడు బలరామ్.

''నువ్విక్కడే వుండు రేవతీ! నేను ప్రైవేట్ కంపెనీలో మంచి జాబ్ సంపాయించి వస్తా. నీక్కూడా జాబ్ చూస్తా. పిల్లలు మరీ చిన్న వాళ్లని గమనించి నిన్ను జాబ్‌లోకి పోనివ్వలేదింతవరకు. పొరపాటే జరిగింది. దిద్దుకుంటా. కాని నువ్వు మావూరు రావోకు. నేను కనిబెట్టేవుంటా. సస్పెన్షన్ పోవాలి. నిజం బైటికి రావాలి. ఫోర్జరీ చేసి యెనభైని యెనభై వేలుగా చేసి డ్రా చేసి తీసుకున్నానట.'' అంతా విని రేవతి తల వూపితే పుట్టెడు ధైర్యంతో వెళ్లిపోయాడు బలరామ్.

3

బలరామ్ ఒక లాయర్ని సంప్రదించాడు. లాయరు తలవూపుతూ అంతా విన్నాడు. లాయరు జగన్నాధరాజు సానుభూతి చూపుతూ, వూరటగా పల్కాడు.

''అదంతా కుట్ర బలరామ్! ఒక్కరివల్ల జరిగిన కుట్ర గాదు. కొంతమంది కలిసి వేసిన పథకం. ఆ పథకం పారింది. నువ్వు ధృతి వీడకు. నేను చేవ్రాళ్లూ, చిరునామాలూ, హాండ్ రైటింగ్, వేలిముద్రలు తేడాలు చూపగలిగిన నిపుణుని పనిలో పెట్టుకున్నాను. వాడి సాయంతో బైటబెట్టగలను. నువ్వు ధైర్యంగా వుండు. డీలాపడకు. సత్యానికి పైకితేలే అలవాటున్నది. నువ్వు ఒక కాగితం మీద పదిసార్లు సంతకం చేసి నా కివ్వు. గాభరా పడకుండా నిదానంగా సంతకం చేయి'' అని పనికానిచ్చి చేవ్రాలు తీసుకున్నాడు లాయరు.

4

తల్లీదండ్రినీ చూడాలనిపించి బలరామ్, కొద్దిరోజుల తర్వాత వీలు చిక్కగానే స్వంతవూరు స్వంతయింటికి వెళ్లాడు. హాలులోకి అడుగుంచగానే తండ్రి నృసింహావతారం కంటబడింది. గర్జిస్తున్నాడు.

''యెంత అప్రతిష్ఠ పాలయ్యా! నీకు పెట్టిన పేరేమిటీ! నీ లీలలేమిటీ? పైగా నీ టక్కులాడిని తెచ్చి ఈ వూళ్లో ప్రతిష్ఠించావూ? నీ కెన్ని గుండెలు? నా తల యింకా నేలబడలేదు. ఆ టక్కులాడిని వూర్నించి పొమ్మను. ఇవాళే తరిమేయాలి. వేరే వూళ్లో టక్కుటమారవిద్యలన్నీ ప్రదర్శించమను. సిగ్గూ లజ్జా లేవా? యేం కులం? దాని తండా తండా వచ్చేశారే. ఈ వూరా వారిది? గుత్తకు తీసుకున్నారా? నా తల కొట్టేయించావు రామా! రాముడేమో తండ్రి ఆజ్ఞకులోబడి, తండ్రికి కీర్తి తెచ్చి, తాను అడవుల పాలైతే, నువ్వేమో నన్ను

అడవులకు తరిమేట్టున్నావు. ఇంక వుండ వూళ్లే లేవటనీ? నాయింటికూ్కడా వస్తారా? రమ్మను. దొమ్మీ జరుగుతుంది. నాకు అండదండలేదనీ, ముసలిననీ అనుకుంటున్నారేమో! ఇది ఉక్కు శరీరం, వజ్రకాయం. యెన్ని యేళ్లుపై బడనీ, యాభైమందికి జవాబు చెప్పగలను. కర్రసాము నేర్చిన వాడిని. కండబలం గలవాడిని. జొన్నన్నం హరాయించుకున్నవాడిని. రమ్మను యెవడొస్తాడో చూస్తా. ఈ వీధిలో అడుగుంచమను. నాసత్తా తెలుస్తుంది. ఊళ్లో తలెత్తుకు తిరక్కుండా చేశావే, నీ సంపాదన చట్టుబండలుగానూ, ప్రతీ ముష్టివాడు నన్ను గేలిచేయడమే. ఆయితాగ్నిగారూ! ఆర్షసాంప్రదాయం గలవారూ! ఇప్పుడు బావుందా? అని కొక్కరిస్తున్నారు'' అని బొబ్బలుపెడుతూ హాలంతా యెగిరాడు. చెమటలు కారినై.

ఐదువరాలైన రథమంత తల్లీ. ఆరడుగుల మనిషీ నిలబడి కబంధహస్తాల్లాంటి చేతులు జాపుతూ నిష్ఠూరమాడింది.

''నీకిదేం రోగం పుట్టింది? మాతో చెప్పి తగలడలేదేం? అదెవతె? అదెట్లా ఒప్పుకున్నదీ? బిడియం లేదా? ఇంటికి బాగా సాయపడుతున్నానని నీకు తల బిరుసెక్కినట్లున్నాది. కళ్లు నెత్తికెక్కాయేమో! నీ సంపాదన దాని బొంద మీదే బోర్లించు. మేమేమీ తినటానికి పిండం లేక చావటం లేదు. వచ్చిన సంబంధమల్లా తిప్పేసిందిందుకా? యేదో సాగితే పెళ్లెందుకని? రంభలాంటి పిల్ల ఒంటెడు నగలతో వస్తుంటే చేదైందే? యేం చూసి తెచ్చావూ? కులమా గోత్రమా? రూపమా? ఐశ్వర్యమా? అందచందాలా? ఆచార వ్యవహారాలా?'' అలా దీర్ఘాలు తీస్తూ దవడలు నొక్కుకున్నది.

బలరామ్ మేనమామ సేతురామయ్య. ఘటోత్కచుడల్లే వుంటాడు. పిత్రార్జితం మంగళం పాడినవాడు. అక్కను బావనూ అప్పుల్లో పీకలవరకు ముంచి, బావచేత ఐపీ పెట్టించినవాడు. అంగోస్త్రంతో నిలబడి వున్నవాడు.

తాషామర్పాలాగా వూదాడు.

''నీ బావమరిదేరా బాలయ్యా! నీ శత్రువులతో చేయి కలిపి, నీ సంతకం చేయగలిగి ఫోర్జరీ చేయటంలో ఘనుడు, వాడే నీ సస్పెన్షన్‌కి కారణం. వాడి భాగం యెంతో నాకు నికరంగా తెలియదు గాని. అయిదువేలన్నా ముట్టి వుండాలి. కుమ్మక్కయిన వాళ్లు ముందే యిస్తారు. నీ రెండో బావమరిదేమో నీ పేరు చెప్పి అప్పు తెచ్చుకుంటున్నాడు. నీ తిప్పులాడికి ఫస్ట్ కజిన్ వుందే, దాని పేరు జగన్మోహిని. నువ్వూ ఆమే సివిల్‌మారేజ్ చేసుకుని వేరే వూళ్లో కాపరం పెట్టుకున్నారని ప్రాపగాండా చేస్తున్నది. దాన్ని గూడా పట్టావూ? వారిద్దరిలో ఒకత్తెను నా కందించు. మీ అత్తయ్య ముసిలి అయి ఆహ్వానిస్తే బెడ్డింగ్ చేయటం లేదు'' అని బారాయమానాలాంటి చేతులు తిప్పుతూ విషపునవ్వు నవ్వుతున్నాడు. అలా నవ్వుతూనే ఆవూళ్లోనే చివరిగా యే వీధిన, బలరామ్ కులుకులాడి వుంటున్నదో పతా చెప్పాడు సేతురామయ్య.

5

ఒక్క వుదుటన వచ్చి ఫైటింగ్ సీన్ వేస్తున్న హీరోను చూస్తున్నట్టు నిలబడిపోయింది రేవతి. బలరామ్ అరుస్తున్నాడు.

''నీకేంబుట్టింది రేవా? ఆవూళ్లోనే వుండమంటినే? వుంటానని తలూపితివే? వుంచినచోట వుండలేవూ? నీ అన్నలు నాకు యే శాస్త్ర ప్రకారం బావమరుదులైనారూ? నేను నిన్ను దనుజ వివాహమాడలేదే? రాక్షసత్త్వం గెలుస్తుందా? దైత్యులా మీరంతా? నా పేరు చెప్పి వూళ్లో అప్పులు చేయటమేమిటే? నేను సివిల్‌మారేజ్ గూడా వెలిగించానూ? సాక్షులూ బెస్ట్‌మాన్ యెవరు? చెప్పాల్సిందే'' అని గంతులేశాడు బలరామ్.

ఉగ్రనారసింహుని యెదుట నించో బెట్టిన ప్రహ్లాదుడల్లే పోజుబెట్టి నిలబడింది రేవతి.

''మీరేం తక్కువ తిన్నారండీ! మొదటే చెపితే విన్నారు గాదు. ఊబిలో దిగుతున్నారని చెప్పాను. నేనీవూరులో కాపరముందామని రాలేదండీ! ఇది మా అమ్మ పింతల్లి యిల్లు. పింతల్లికి సంతు లేదు. మా అమ్మనే పెంచుకున్నది. అమెపోతూ యీ యిల్లు మా అమ్మ కిచ్చిపోయింది. మా అమ్మకీయిల్లు దఖలు పడింది. మేమున్న వూళ్లో నీళ్ల యెద్దడి వచ్చింది. బావులూ ఒట్టిపోయాయి. నీళ్లు మొయ్యలేము. కొళాయి వదలటం లేదు. 'ఆ వూళ్లో బావులు లోతుండవు. జానెడు తాడుతో నీళ్లు తోడుకోవచ్చు. దొడ్లో ఒరల బావి వున్నది. పోదాం రా' అని మా అమ్మ తెచ్చేసిందీ వూరు. ఈ యింట్లో వుంచింది. సామానెంత వున్నది గనక ఓ గోతంలో పడేసి మూసేసి కుట్టేసింది. మొదట మీకు నేను దిక్కూ మొక్కూ లేనిదానల్లే కనిపించానేమో. ఇదేమి చేయగలదనుకున్నారేమో. ఇప్పుడు మునిగిపోయిందేమున్నదీ? నామానాన నన్ను వదిలేయచ్చునే. మిమ్మల్ని మేమేమి చేయగలమూ? సాక్ష్యమేదీ? నేను మీతో తగూ పెట్టుకోను'' అభినయిస్తూ అంటున్నది రేవతి.

''నోర్మూయ్ ముందు. నేనలా చేయలేననే నీకు దిలాసా. అందుకే తెగించావు'' అని వురిమి మీద కొచ్చాడు.

''కొట్టాలనుందా? జుట్టు పట్టుకు వంగదీసి వీపు పెట్లగొట్టాలనుందా?'' అని జుట్టుముడి విప్పి జుట్టు అందించింది రేవతి. బలరామ్ అందుకోలేదు.

''పోనీ కఱ్ఱతో కొట్టండి. కసి తీరుతుంది'' అని ఆ దాపునే వున్న కఱ్ఱ అందించింది. అందుకోలేదు.

''నీకా నాకా కసి? మా నాన్న కెంత అవమానం జరిగింది? దొమ్మీకి తలపడ్డారా మీ వాళ్లు ? మీ పూర్వీకులు వీధి భాగవతమాడేవారట ఆ అలవాటు పోలేదేమో. రక్తంలో వుండిపోయిందేమో. మీ అమ్మ సత్యభామ వేషం వేసి భామాకలాపమాడుతూ తెయ్‌మని గెంతేదట'' అంటున్నాడు బలరామ్.

పిల్లలిద్దరూ పలకాపుస్తకాలు పట్టుకుని, ప్రాథమిక పాఠశాలనించి వచ్చారు. తలుపునెట్టి లోపలి కొచ్చారు. పిల్లకి మూడోయేడు. పిల్లడికి అయిదోయేడు. నవ్వుతూ తండ్రిని పలకరించారు. బలరామ్ కుర్చీలో కూలబడి కూచున్నాడు. పలకలు చూపారు.

''మేము బళ్లో చేరాము డాడీ! నేను మూడో క్లాసూ చెల్లి ఒకటో క్లాసూ. పరీక్షలు పాసైనాము. ఇప్పుడు నేను నాలుగు. చెల్లి రెండో తరగతి చదవాలి. మా పేర్లు పుస్తకంలో రాసింది మా టీచరమ్మ కామేశ్వరి. మళ్లా బడితీయగానే అటెండెన్సు తీసుకుంటుంటె లేచి ప్రెజెంట్ మేడమ్ అనాలి అని చెప్పింది మా టీచర్. నీ పేరూ అమ్మపేరూ పలకమీద రాయమన్నది. రాసి చూపించా. చెల్లిని రాయమంటే బాలరామ అని మాత్రం రాసింది. మా టీచరమ్మ నవ్వింది. దానికింకా గుణింతాలు రావని నేనే చెప్పా. కోపంగా వున్నారెందుకూ? మేం బడికెళ్లద్దా ? ఆటల్లో పోటీకెళ్లద్దూ? చెల్లికి అప్పుడే డ్రిల్లు బాగా వచ్చేసింది. చేసి చూపిస్తుంది'' అన్నాడు పిల్లడు.

బలరామ్ శాంతించాడుగానీ. రేవతి మాటలు నమ్మలేదు. కథ అల్లి చెప్పిందనుకున్నాడు. పిల్లలతో ఆడి ఆ రాత్రికుండి వెళ్లిపోయాడు.

6

దొమ్మీ జరగలేదు గదా అని సంతోషించి బలరామ్ తనమీది కెక్కిన నేరం తొలగి, నిర్దోషి అని తేలే దాకా టెంపరరీ జాబ్ సంపాయించి, రేవతితోనూ పిల్లలతోనూ, తన తల్లిదండ్రులతోనూ కాలక్షేపం చేస్తున్నాడు.

రేవతీ పిల్లలూ, గుడికెళ్లినప్పుడో, బజారెళ్లినప్పుడో బంధువింటికి వెళ్లినప్పుడో జగన్మోహిని వస్తుంది. బలరామ్ యింట్లో కనిపిస్తాడు.

''పిల్లల్ని చూసిపోదామని వచ్చాను. నా కలవాటు వాళ్లిద్దరూ'' అని

నవ్వుతూ నిలబడి కులుకుతుంది. సొగసుల మిటారిమేల్బంతి లాగా కనిపిస్తుంది.

అధృతి అనే పొర బాణం లాగా దూసుకుని బలరామ్ మనసుకి గాటంగా గుచ్చుకున్నది.

'' ఈ రేవతి యింట్లో వుండకుండా యెందుకు పోతుందీ? ఈ జగన్మోహినికి నేను ఒంటరిగా అందాలనా? నాచేత ఖర్చు పెట్టిస్తున్నారు. పని చెప్పి చేయిస్తున్నారు. వీళ్లంతా నేను చేతగాని వాడిననుకుని ఆటలు పట్టిస్తున్నారు. నిజంగా చేతగాని వాడినా? అలుసైనానా? చూదాం'' అనుకునీ తల పంకించాడు బలరామ్.

''చేతి కందినదానిని వదులు కోటమెందుకూ?''

''వీళ్లు తప్పు పనులు చేయటం లేదూ. వెరుస్తున్నారా? మా యింట్లోనూ స్వార్థపరులు పోగై, నన్నాడిపోసుకుంటూ, మా అమ్మా నాన్నకు తైరుపోస్తూ పొట్టలు నింపుకుంటున్నారు. ఇప్పటికీ డబ్బు అందిస్తూనే వున్నా. అవసరానికి అడుగుతూనే వున్నారు. ఇదొక్కటేనా అవినీతీ తప్పూనూ? ఈ వచ్చే జగన్ తనవూరిలోనే యెవరినో ఒకరి నెందుకు మోసగించదూ?'' ఇట్లా పరిపరివిధాల ఆలోచిస్తూ వికలమై, తానేమౌతున్నదీ చూసుకోకుండా బాణం తాకిడికి లోనైనాడు బలరామ్. మోహం తీర్చటంలో వచ్చే అపాయం వూహించలేక పోయాడు.

7

అలా రోజులు గడిచినై. బలరామ్ మీది కేసు తొలగిపోయే స్థితికి వస్తున్నది. ఆనాడు రేవతి వున్న యింటికి వచ్చాడు. అదేదో జాలం చూస్తున్నట్టు నిలబడిపోయాడు. ఇంటిముందు జనులు కతారు తీర్చి వింత చూస్తున్నారు. చూసే తమాషా నవ్వు తెప్పిస్తుంటే నవ్వుతున్నారు.

తలుపులు తీసి వున్నాయి. పిల్లలు యేడుస్తున్నారు. జగన్మోహిని రేవతిని జుట్టు పట్టుకు వంగదీసి బాదుతున్నది. వీధిలోకి లాక్కొచ్చి ఒక్కతోపుతోసి కిందపడేసింది. పిల్లల్నిద్దర్నీ లాక్కొచ్చి వీధిలోకి నెట్టింది.

''ఫో నాయింట్లోనించి. ఇది నాయిల్లు. నువ్వెవతవి? ఈ యిల్లు నాపేర పెట్టింది అమ్మమ్మ. నేనూ బలరామ్ యేనాడో మోహించుకున్నాము. అమ్మతో చెప్పగానే గుళ్లో పెళ్లిలాటిది చేసింది. నీ ఒక్కత్తెవేనా? చాలామందివున్నారు బలరామ్‌కి. నీకిక్కడ హక్కు లేదు. లోపలి కొచ్చావా గుద్ది, గొంతు పిసికి చంపేస్తా. నేనేమీ ముసలి వగ్గుని కాను. నాదీ పిల్లల్ని కనే యీడే. నువ్వేవాడిని వంచించి మతి విరిచి విడదీశావు. యెలాగైతేనేం మళ్లా కలుసుకుని ఒకచోట వున్నాం. కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నావే? కొంపలు మాపే కొరివి!'' అంటూ చెంబులూ గిన్నెలూ పీటలు విసిరేస్తున్నది.

బలరామ్ రేవతి వంక చూశాడు. తనహక్కు ప్రకటిస్తుందేమోననీ, యెదిరిస్తుందేమోననీ చూశాడు. లేదు. రేవతి విషాదంగా నవ్వి తడి కళ్లతో అన్నది.

''మీరు చేయలేని పని మీ మోహం చేయగలిగింది'' అని పిల్లనెత్తుకుని పిల్లవాడి చేయిపట్టుకుని వెళ్లబోయింది.

'' ఆగు. రేవా!'' అని అరిచాడు బలరామ్.

అప్పుడు పదకొండు పొరలనూ కంట్రోల్ చేసే, ఆ పొరలకంటె అధికురాలైన శక్తి, హ్రీః, శ్రీ, ధీః అని పిలవబడేది దూసుకొచ్చి బలరామ్ గుండెకి తాకింది.

నిమిషంలో బలరామ్ పక్కింట్లోకి వెళ్లి ఫోన్ చేశాడు. మళ్లా వచ్చాడు. చూస్తూ నిలబడ్డాడు.

జగన్మోహిని జగన్మోహనంగా నవ్వుతూ, కులుకుతూ మెట్లు దిగి వచ్చింది. బలరామ్‌తో అన్నది.

''కలిసి వుందామంటే వినటం లేదు రేవతి. పిల్లల్ని వదిలి వుండలేక నీ దగ్గరే వుంటాను, నన్ను గూడా వుండనీ అంటే వినలేదు. పొమ్మన్నది. మీ యింటికి వెళ్తే అక్కడా లేవు. మీ వాళ్లేమో 'నీ ఆస్తి మా అబ్బాయి పేరపెట్టి మరీరా. నీకు అమ్ముకునే హక్కున్నది. మీ అమ్మేమీ తక్కువ తినలేదు. నీ ఆస్తికోసమే నిన్ను గారం చేస్తూ స్వేచ్ఛగా తిరగనిస్తోంది. మా అబ్బాయిని కేసులో యిరికించి సస్పెండ్ చేయించింది మీ వాళ్లే. పో. పోయి. ఆస్తి అమ్మి డబ్బు మూటకట్టుకురా' అని బయటికి గెంటారు. చాలా మంది పోగైనారే మీ యింట్లో బలరామ్! బలరామ్ డబ్బు అడగడు. డబ్బు యిస్తాడు. అందుకే ప్రేమించానంటే అర్థం చేసుకోక బయటకు గెంటి తలుపేసుకున్నారు. రేవతి నిన్నెక్కడ దాచిందో చెప్పటం లేదు. అందుకని బాదాను'' అని కదిలిపోతూ విలాసంగా నవ్వుతున్నది. విరబోసిన జుట్టూ విలువైన చీరా రవికా, నగలూ, బొడ్డున సంచీలో నాణాలూ.

అంబులెన్సు వచ్చేసింది. అందునుంచి ఆడపోలీసులు, ఇద్దరు ఆయాలూ, ఇద్దరు నర్సులూ దిగివచ్చి, బలరామ్ సన్న అందుకుని జగన్మోహినిని వాటేసుకుని బలవంతంగా అంబులెన్స్‌లో కూరి తామూ యెక్కి తలుపులు మూసి వెళ్లిపోయారు.

జనం పల్చబడి నిష్క్రమించారు. దీపాల వేళైంది.

ఇరుగుపొరుగు వచ్చి విసరివేయబడిన గిన్నెలూ చెంబులూ లోపల బెట్టారు.

బలరామ్ పిల్లల్ని పట్టుకుని లోపలికి తీసికెళ్లి లైటేశాడు. రేవతిని లోపలికి రానిచ్చి తలుపేశాడు.

తానే దగ్గరుండి సాయపడ్డాడు. అన్నం కూరా, చారూ వండటం కాగానే పళ్లాలు పెట్టాడు. కంది పొడీ నెయ్యీ కూరా చారూ అన్నీ వుంచి అన్నం కలిపి పిల్లల చేత తినిపించాడు.

వాళ్లు వెళ్లి బొమ్మల పుస్తకాల ముందు కూచున్నాక రేవతిని కూచోమని పళ్లేలలో అన్నం కలిపి,''తిను. మతిలేనామెకు వెరిచావెందుకూ? మతిబోయినామెకు లొంగావెందుకూ?'' అని నవ్వాడు.

''మీరే లొంగారు'' అని కళ్లు తుడుచుకుంటూ నవ్వింది రేవతి.

''నన్నేం చేయగలరూ? నేను నిర్దోషినని కేసు కొట్టేసారు. తక్కిన నేరస్థులతో సహా మీ అన్న అరెస్టయినాడు. నేనివాళే జాబ్‌లో జాయినయినాను. నన్ను మరో వూరు వేశారు. మనం పోదాం. ఆ సంగతి చెపుదామనే వచ్చేప్పటికి యిదీ సీను'' అని నవ్వి తన పళ్లెంలో అన్నం తాను తినసాగాడు బలరామ్.